క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలోని దొండపాడు, నూజెండ్ల మండలంలోని కంభంపాడు గ్రామాల్లోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో స్వామి ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, ఆయా గ్రామప్రజలు పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఏపీఓగా పద్మజ బాధ్యతల స్వీకారం

శావల్యాపురం: ఉపాధి హామీ పథకం ఏపీఓగా టి.పద్మజ సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య తెలిపారు. ఈమె అమరావతి మండలంలో ఏపీఓగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఏపీఓ రాజు బదిలీపై పిడుగురాళ్ల వెళ్ళినట్లు వివరించారు.

అంకమ్మ తల్లి తిరునాళ్లకు విరాళం



చిలకలూరిపేట: పట్టణంలోని పాటిమీద వేంచేసిన అంకమ్మతల్లి పోతురాజు స్వామి 22వ తిరునాళ్ల మహోత్సవం ఈనెల మూడో తేదీన నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం కోసం ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్ నాయుడు ఆధ్వర్యంలో రూ.రెండు లక్షలు విరాళం సోమవారం అందజేశారు. ఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం ఏర్పాటు చేసిన అమ్మవారి అభిషేక పూజల్లో పాల్గొని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

పుంత రోడ్లకు మరమ్మతులు



శావల్యాపురం: పొలాలకు వెళ్లే పుంత రోడ్లకు మరమ్మతులు చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ నాయకులు అనిల్‌కుమార్ చెప్పారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు సహకారంతో 15 ఏళ్ల నుంచి జరగని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో నాలుగు రోడ్ల మరమ్మతులు చేపట్టామని వెల్లడించారు. కారుమంచి గ్రామంలో మూడు రోడ్ల పనులు జరుగుతున్నాయని వివరించారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, మండల కో–ఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు పోపూరి చిన్నా, చిట్టేటి రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకందారులకు జరిమానా

యడ్లపాడు: గ్రావెల్ అక్రమంగా తవ్వుతున్న వారికి మైనింగ్ అధికారులు జరిమానా విధించారు. ఇటీవల సంగంగోపాలపురంలో మట్టి తవ్వకాలపై దాడులు చేసి జేసీబీతోపాటు ఓ టిప్పర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తవ్వకాలు చేస్తున్న చిరంజీవి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి అతనికి రూ.60,000 అపరాధ రుసుం విధించినట్లు జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ కొండారెడ్డి సోమవారం తెలిపారు.

ఎంఆర్ ఫౌండేషన్ సాయం



నాదెండ్ల: ఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బుక్కాపురం గ్రామంలో రెండు కుటుంబాలకు సోమవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఏపీఐఐసీ డైరెక్టర్, ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో రూ.45 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబాలకు అందించారు. గ్రామానికి చెందిన యర్రం అశోక్‌బాబు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స పొందుతూ మంచానికే పరిమితమైన అశోక్‌బాబు కుటుంబానికి రూ.20 వేలు అందించారు. ఇదే గ్రామానికి చెందిన కటూరు శివ పొలం పనులు చేసుకుంటుండగా పాముకాటుకు గురై మరణించాడు. దీంతో ఆయన కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

సంక్షేమంతో సంతోషం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన
- సీఎం వైఎస్ జగన్ వెంటే మేమంటూ ప్రజల నినాదం



చందవరంలో గడప గడపకు కార్యక్రమంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

నాదెండ్ల: అభివృద్ధి, సంక్షేమంతో అన్ని వర్గాల ప్రజల్లో అమిత సంతోషం వ్యక్తమవుతోందని, సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే తాముంటామని ప్రజలు చెబుతుండటం తమ ప్రభుత్వ పాలనకు గీటురాయి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చందవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం చివరి రోజు నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ.. ప్రజలతో ముచ్చటిస్తూ మంత్రి ముందుకు సాగారు. అనంతరం మంత్రి విడదల రజిని మాట్లాడుతూ, గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో సాధ్యమైందని సగర్వంగా ప్రకటించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముగింట్లోకి తెచ్చారని పేర్కొన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అన్ని పథకాలను ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు అందిస్తున్నారని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన చేశారని గుర్తుచేశారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లతో అన్ని పదవుల్లో మహిళా సాధికారత సాధించేలా అడుగులు వేయించారని ప్రశంసించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో, ఇతర ప్రభుత్వ పదవుల్లో పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించారన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, విద్యా వసతి, వైఎస్సార్ ఆసరా, చేయూత, వాహనమిత్ర, లానేస్తం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుతో అన్ని వర్గాల జీవితాల్లో సంతోషాల సిరులు కురిపించారని ఆనందం వ్యక్తం చేశారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రంలోనే స్వర్ణయుగం ఆవిష్కృతమైందన్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుకను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, నాదెండ్ల, గణపవరం సొసైటీ చైర్మన్లు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, మార్కెట్‌యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, పార్టీ నాయకులు చేరెడ్డి అంకిరెడ్డి, సింగారెడ్డి కోటిరెడ్డి, కాట్రు రమేష్, విడదల గోపీనాథ్, చేరెడ్డి దశరథరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, పూదోట రామకృష్ణ, ఆవుల గోపీ, పూదోట గంగిరాజు, మేకతోటి హనుమయ్య, వనమాల వెంకటేశ్వర్లు, పసుపులేటి శ్రీను, చేరెడ్డి సుబ్బారెడ్డి, భాస్కరరెడ్డి, వెంకటరెడ్డి, అనంతరామిరెడ్డి, గొంటు అర్జున్‌రెడ్డి, రాఘవరెడ్డి, నారాయణరెడ్డి, అప్పిరెడ్డి, రామిరెడ్డి, గొంటు హనిమిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జన హృదయాల్లో సీఎం జగన్

- మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి
- ఎమ్మెల్యేగా నేను హ్యాట్రిక్ సాధించడం ఖాయం
- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధీమా
- 12వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



12వ వార్డు షాలెంనగర్‌లో సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: ప్రజల స్పందన చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం ఖాయమని, ఎమ్మెల్యేగా తాను హాట్రిక్ సాధించటం తథ్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ప్రకాష్‌నగర్‌లోని 12వ వార్డు షాలెంనగర్‌లో అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఇ.ఎం.స్వామి గృహం నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధిని గురించి వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ నరసరావుపేటను జిల్లా కేంద్రంగా చేసి 65 ఏళ్ల ప్రజల కలను సాకారం చేశామన్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో సుమారుగా రూ.800 కోట్ల విలువైన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. 12వ వార్డులో రూ.8.68 కోట్ల మేర ప్రయోజనం ప్రజలకు చేకూరిందని వివరించారు. మరో రూ.1.02 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేశామన్నారు. మరో రూ.67 లక్షల పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.20 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. స్థానిక టీడీపీ నాయకుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు కేవలం రాజకీయ ఉనికి కోసమే తమపై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్‌మయం చేశారంటూ పనికి మాలిన ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఒ.శ్రీనివాసరావు, టీపీఎస్ అనూరాధ, ఆర్ఐ పీటర్, విద్యుత్‌శాఖ ఏఈ సురేంద్ర, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గంటెనపాటి గాబ్రియేలు, మాజీ కౌన్సిలర్ నెలటూరి మురళి, పట్టణ అధికార ప్రతినిధి భూమిరెడ్డి కొండారెడ్డి, సీనియర్ నాయకులు సానికొమ్ము కోటిరెడ్డి, వార్డు నాయకులు షేక్ జిలాని, షేక్ జక్రియా, గంటెనపాటి సుందరం, యూనిస్, రేషన్‌డీలర్లు, సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో 'స్పందన'



కొండ్రముట్ల సచివాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్



గరికపాడు సచివాలయ పరిధిలో స్పందనకు హాజరైన తహసీల్దార్ తదితరులు

ఈపూరు/బొల్లాపల్లి/శావల్యాపురం/రొంపిచర్ల : నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల్లో సోమవారం మండలస్థాయి స్పందన జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈపూరు మండలం కొండ్రముట్ల గ్రామ సచివాలయంలో తహసీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లునాయక్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

■ బొల్లాపల్లి మండలంలోని గరికపాడు గ్రామ సచివాలయంలో మండలస్థాయి స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ వి.సుధాకర్ శర్మ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జీఎస్ శ్రీనివాసరావు, వీఆర్వో జె.రవినాయక్ పాల్గొన్నారు.

■ శావల్యాపురం మండలం శానంపూడి సచివాలయంలో సోమవారం మండలస్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దారు షేక్ జాన్‌సైదులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఏఈఓ పురేటి అశోకా పాల్గొన్నారు.



గోగులపాడు గ్రామంలో జరిగిన స్పందన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అంకారావు

■ రొంపిచర్ల మండలం గోగులపాడు గ్రామంలో సోమవారం మండలస్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ అంకారావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 22 మంది అర్జీలు అందించారు. పలు సమస్యలకు అధికారులు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. కార్యక్రమంలో గోగులపాడు, కొనకంచివారిపాలెం సర్పంచ్‌లు ముంద్రు హరినారాయణ, పునుగోటి నాసరరావు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సంసిథ్ స్కూలు



శావల్యాపురం: కనమర్లపూడి గ్రామ సమీపాన ఉన్న సంసిథ్ గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థులు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఆదివారం రాత్రి ఈ పాఠశాల విద్యార్థులు 127 మంది 80 నిమిషాల్లో వందసార్లు రఘుపతి రాఘవ రాజారాం పాటను ఆలపించి రికార్డు నెలకొల్పారు. ఈ సందర్భంగా స్కూల్ సీఈఓ ఇందుసాను, ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఎడ్యుకేటర్ దుర్గా వెంకటేశ్వర్లు విద్యార్థులను అభినందించారు.

అందాల గోవులు

అందాలపోటీల్లో నాదెండ్ల ఒంగోలు జాతి ఆవులకు బహుమతులు



ముకుంద మనోహరం : ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ముకుంద ఆవు

నాదెండ్ల : అఖిల భారత ఒంగోలు–పుంగనూరు ఆవుల అందాల పోటీల్లో నాదెండ్ల గ్రామానికి చెందిన నల్లమోతు వేణుగోపాలరావు పోషిస్తున్న ఆవులు విజేతలై నిలిచాయి. ఏలూరు జిల్లా మండపల్లి మండలం కానుకొల్లు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఒంగోలు–పుంగనూరు జాతి ఆవుల పోటీలు నిర్వహించారు. ఏప్రియల్ 29 నుంచి మే 1 వరకూ జరిగిన ఈ పోటీలు పాలపళ్ల, రెండు,నాలుగు, ఆరు పళ్ళ విభాగాల్లో జరిగాయి. వేణుగోపాలరావుకు చెందిన ముకుంద, అఖండ పేర్లు గల ఆవులు పోటీల్లో పాల్గొన్నాయి. ముకుంద పాలపళ్ల విభాగంలో ప్రథమస్థానం సాధించడమే కాకుండా ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచింది. అఖండ రెండుపళ్ళ విభాగంలో మూడో స్థానం సాధించింది. సోమవారం ఏలూరు జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు జి.నెహ్రూబాబు, కార్యనిర్వాహక సంఘం అధ్యక్షుడు టి.సత్యనారాయణ చేతుల మీదుగా నగదు, ప్రశంసాపత్రం, షీల్డ్ అందుకున్నారు.

రెంటచింతలలో 46.4 మిల్లీమీటర్ల వర్షపాతం

రెంటచింతల: రెంటచింతలలో సోమవారం తెల్లవారు జాము 2 గంటల నుంచి 5 గంటల వరకు వర్షం కురిసింది. 46.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ బద్దిగం ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.

సమరమే



చిలకలూరిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు

- మేడే స్ఫూర్తితో ఐక్యపోరాటాలు
- నినదించిన కార్మిక సంఘాలు
- వాడవాడలా ప్రపంచ కార్మిక దినోత్సవం



నరసరావుపేటలో మేడే ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు



వినుకొండలో మేడే వేడుకల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు

చిలకలూరిపేట/నరసరావుపేట/నరసరావుపేట ఈస్ట్/వినుకొండ(నూజెండ్ల)/రొంపిచర్ల/యడ్లపాడు: మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకుందామని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ కార్మికులకు సూచించారు. సీపీఐ, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. శ్రామిక పతాకాలను ఎగురవేశారు. సీపీఐ కార్యాలయం వద్ద నుంచి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

■ నరసరావుపేట పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీసుకు ఎదురుగా ఏజెంట్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు షేక్ నబీబాజీ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా బ్రాంచ్ మేనేజర్ జాన్‌విక్టర్ హాజరై మేడే జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ స్టేట్ సెక్రటరీ ముజఫర్ అహ్మద్, మండల అధ్యక్షులు సిలార్ మసూద్, ఎల్ఐసీ ఏఓ మురళి, రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు. మున్సిపల్ వర్కర్స్ ఒకటో డివిజన్ కార్యాలయం వద్ద మేడే జెండాను సీఐటీయూ నాయకులు ఆవిష్కరించారు. మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ కార్యాలయం వద్ద, ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఏర్పాటుచేసిన మేడే జెండాలను నాయకులు ఆవిష్కరించారు. ఏరియా వైద్యశాల వద్ద యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మేడే జెండాను ఆవిష్కరించారు. వ్యవసాయ మార్కెటింగ్ యార్డు వద్దనున్న ముఠా కార్మికుల సంఘం జెండాను నేతలు ఆవిష్కరించారు.

■ నరసరావుపేట అరండల్‌పేటలోని సీపీఐ, ఏఐటీయూసీ కార్యాలయాల వద్ద ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మేడే జెండాను ఆవిష్కరించారు. అనంతరం మెయిన్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద ప్రగతిశీల కార్మిక సమాఖ్య, చైతన్య గ్యాస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఎగురవేశారు.

■ వినుకొండ పట్టణంలో పలు సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు.

■ రొంపిచర్ల వీరవట్నం, సంతగుడిపాడు, విప్పర్లపల్లి గ్రామాలలో మేడే వేడుకలు జరిగాయి.

■ యడ్లపాడులో సీపీఎం అనుబంధ సంస్థ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. యడ్లపాడులోని తహసీల్దార్ కార్యాలయం కూడలి వద్ద సీఐటీయూ జెండాను ఆంజనేయులు ఎగురవేశారు. డివిజన్ కార్యదర్శి పోపూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. సీపీఐ చిలకలూరిపేట ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతమైన బోయపాలెంలో మేడే నిర్వహించారు. పార్టీ ఏరియా కౌన్సిల్ సభ్యులు షేక్ ఖాదర్‌బి సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ సుభాని పాల్గొన్నారు.

■ తిమ్మాపురంలోని తిరుమల కాటన్, ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రాంగణంలో జరిగిన మేడే వేడుకల్లో పల్నాడు జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ధనలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మిక పథకాలు, చట్టాల గురించి వివరించారు. అనంతరం మిల్లు ఎండీ పెరవలి రాఘవరావు కార్మికుల సంరక్షణ కోసం రాసిన పుస్తకాన్ని కార్మిక శాఖ ఉపకమిషనర్ యు.మల్లేశ్వరకుమార్‌తో కలిసి ఆమె ఆవిష్కరించి మిల్లులోని కార్మికులకు పంపిణీ చేశారు.

80 శాతం పింఛన్ల పంపిణీ



గణపవరంలో వృద్ధాప్య పింఛను అందిస్తున్న వలంటీర్ మహబూబ్‌బీ



చందవరంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

నాదెండ్ల: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ సోమవారం మండలంలో 80 శాతంపైగా పూర్తి చేశారు. మే నెలలో 9,289 మంది లబ్ధిదారులకు రూ.2,56,00,750 పంపిణీ చేయాల్సిఉండగా, ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి పింఛను సొమ్ము పంపిణీ చేశారు.

వలంటీర్లపై శాఖాపరమైన చర్యలు

చందవరం గ్రామంలో మూడురోజులుగా జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గైర్హాజరైన వలంటీర్లపై అధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. తాత్కాలికంగా విధుల నుంచి పక్కనబెట్టారు. సోమవారం 1న పింఛన్ల పంపిణీ జరగాల్సి ఉండగా, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనకపోవడం వల్ల వలంటీర్లపై చర్యలు తీసుకున్నామని వివరించారు. ఇదిలా ఉంటే తమను నిలిపివేయటం అన్యాయమంటూ సచివాలయం వద్ద వలంటీర్లు కొంతసేపు ఆందోళన చేశారు.

చిలకలూరిపేటలో 81శాతం

చిలకలూరిపేటటౌన్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ వేగంగా సాగుతోంది. సోమవారం వేకువజామునే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందించారు. తొలి రోజు మండలంలో 81 శాతం, పట్టణ పరిధిలో 80 శాతం పింఛన్ పంపిణీ పూర్తయింది.

సర్దార్ కాసు వెంగళరెడ్డి వర్ధంతి



వెంగళరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి తదితరులు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జెడ్పీ మాజీ చైర్మన్ సర్దార్ కాసు వెంగళరెడ్డి 43వ వర్ధంతి నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని వెంగళరెడ్డి విగ్రహానికి గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ పులగం కోటయ్య, గ్రామ సర్పంచ్ కొమ్ము నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కల్లి సుబ్బారెడ్డి, కల్లి వెంకటరెడ్డి, పడాల వేణుగోపాల్ రెడ్డి, కోటేళ్ళ చిన్నా, కోట్ల శివారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ విజేతలకు బహుమతి ప్రదానం



విజేతలకు బహుమతులు అందచేస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట ఈస్ట్: సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పురుషుల డబుల్స్ షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన లిబ్నీ, దినేష్ జట్టు ప్రథమ, రవికుమార్, బిట్టు జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. 45 ఏళ్ల పైబడిన విభాగంలో రవికుమార్, సుబ్బయ్య జట్టు, డాక్టర్ సురేష్, శివ జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. నరసరావుపేట స్థానికులకు నిర్వహించిన పోటీలో వినయ్‌సాగర్, మాణిక్యరావు జట్టు, సాయిప్రసాద్, కిషోర్ జట్టు బహుమతులు సాధించాయి. విజేతలకు నిర్వాహకులు డి.పరమేశ్వరరావు, డాక్టర్ వి.శరత్‌చంద్ర, టౌన్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, బాజీ, విక్రమ్‌సింగ్, జాకోబ్ బహుమతులు అందజేశారు.

7న ఇర్లపాడులో సీతారామచంద్ర విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు

శావల్యాపురం: ఇర్లపాడు గ్రామంలో కొత్తగా నిర్మించిన లక్ష్మణ, హనుమాన్ సమేత సీతారామచంద్ర స్వామి, ఉత్సవ బింబ జీవధ్వజ విమాన శిఖర గణపతి స్వాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతిష్ఠా ఉత్సవాలు పరుచూరి హనుమంతాచార్యులు (గోపినాథ్) ఆగమ వేదపండితులు సారథ్యంలో గ్రామస్తులు దాతల సౌజన్యంలో నూతన ప్రతిష్ఠా వేడుకలు జరుపుతున్నట్లు వివరించారు. ఈనెల 3న సాయంత్రం నుంచి విశేష పూజలు, 4న అగ్నిధ్యానం, వాస్తు హోమం, నవగ్రహ హోమాలు, 5న సుప్రభాత సేవ, క్షీరాధివాసం, మహాశాంతి హోమం, 6న వేద పారాయణం, సంతానం లేనివారికి యజ్ఞపాయనం ప్రసాదం పంపిణీ జరుగుతాయని వెల్లడించారు. 7వ తేదీ ముగింపు రోజు విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఉదయం 6.58 గంటలకు జరుగుతాయని, అనంతరం స్వామి శాంతి కల్యాణం, మహదాశీర్వచనం మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం జరుగుతుందని, మరిన్ని వివరాలకు 9492901438, 9182591614,6305396955 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రోటరీక్లబ్‌కు రూ.లక్ష అందజేత

చిలకలూరిపేటటౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట చేస్తున్న సేవలకు దాతలు సహకరించటం అభినందనీయమని క్లబ్ అధ్యక్షుడు తాళ్ల అంజిరెడ్డి చెప్పారు. సోమవారం రోటరీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ కార్యాలయంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న వైద్యశిబిరానికి రిటైర్డ్ అధ్యాపకులు తోటకూర ప్రభాకరరావు రూ.లక్ష చెక్కును విరాళంగా అందజేశారు. చెక్కు అందజేసిన ప్రభాకరరావును క్లబ్ సభ్యులు అభినందించారు.

మురుగుకుంటలో జారిపడి వృద్ధుడు మృతి

చిలకలూరిపేట టౌన్: డ్రెయినేజ్ వాటర్ నిల్వ కోసం ఏర్పాటు చేసిన కుంటలో ప్రమాదవశాత్తు వృద్ధుడు పడి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని కుక్కపల్లివారిపాలెంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కట్టా రామారావు గ్రామం వెలుపల ఓ కొట్టాన్ని ఏర్పాటు చేసుకుని పది పశువులు పెంచుతున్నాడు. కొట్టం వద్ద ఉన్న కుంటలో సోమవారం అతను ప్రమాదవశాత్తు పడి మరణించాడు. కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.